క్లుప్తంగా

సీపెట్‌లో శిక్షణతో కూడిన ఉపాధి

గన్నవరం రూరల్: నిరుద్యోగ యువతకు శిక్షణతో కూడిన ఉపాధి కల్పిస్తున్నట్లు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సౌజన్యంతో 10వ తరగతి పాసై 35 సంవత్సరాలు లోపు వయసు గల నిరుద్యోగులకు ఉచితంగా పాలిమర్స్ టెక్నాలజీలో మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సుల్లో 3 నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగం కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు కె.సుందరరావు, 9398050255 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆడుదాం ఆంధ్రకు సిద్ధమవుతున్న క్రీడా ప్రాంగణాలు



గన్నవరం: ఆడుదాం ఆంధ్ర పోటీలు ఈ నెల 15వ తేది నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో మండలంలోని క్రీడా ప్రాంగణాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. తొలుత గ్రామ సచివాలయ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ డబుల్స్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించి కబడ్డీ, ఖోఖో, షటిల్ కోర్టులను సిద్ధం చేస్తున్నారు. మిగిలిన పాఠశాలలోని క్రీడా ప్రాంగణాలను కూడా ఆడుదాం ఆంధ్ర పోటీలకు ముస్తాబు చేస్తున్నారు.

డాక్టర్ గీతికకు గోల్డ్ మెడల్



గన్నవరం రూరల్: ప్రతిభతో నేటి వైద్యులు ప్రపంచం గర్వించే స్థాయికి చేరారని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు అన్నారు. ప్రొఫెసర్ కేఆర్ఆర్ మోహన్‌రావు మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను డాక్టర్ పాటిబండ్ల గీతికకు కళాశాలలో శనివారం అందజేశారు. జనరల్ సర్జరీ విభాగంలో విశేష ప్రతిభతో అత్యుత్తమ మార్కులు సాధించిన గీతికను అభినందించారు. గీతికతో పాటు పలువురు వైద్యులను సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి


ఉయ్యూరు: తుపాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ అన్నారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ తీగల కింద, చెట్ల కింద నిలబడొద్దని, ప్రమాదవశాత్తూ కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడితే ఎవరూ తాకొద్దని సూచించారు. రైతులు విద్యుత్ మోటర్లు, వైర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని 1912కి ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు.

సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: ఎస్ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ఘంటసాల జయంతి సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో వీర్రాజు, డీజే నాగరాజు, కేవీ రమణబాబు, సయ్యద్ ఆలీ, జోషి, రేష్మ, మాధవి, శ్రీనివాసరావు పలు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతరాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మధుర స్వరాలశాల ఘంటసాల



విజయవాడ కల్చరల్: మధుర స్వరాలశాల ఘంటసాల అని స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శి ఎస్ఆర్ ప్రభాకర్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల 101 జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఘంటసాల స్వరం తెలుగు వారి ఆత్మగా అభివర్ణించారు. సంస్థ అధ్యక్షుడు బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, చంద్రశేఖర్, బాలాజీ కుమార్‌తోపాటు నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు ఘంటసాల గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

విద్యార్థుల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు



పెనమలూరులో అదనపు తరగతి గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి

పెనమలూరు: విద్యార్థుల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు ఉందని, జగనన్న ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం ద్వారా రూ. 36లక్షలు, దాతలు మునుగోటి సత్యవతి, ఆమె కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన రూ. 15లక్షల విరాళంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, వంటశాల భవనాన్ని ఎమ్మెల్యే పార్థసారథి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాగానే దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు పథకంతో అద్భుతంగా అభివృద్ధి చేశారని చెప్పారు. జగనన్న రాకముందు ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయో, ఆయన వచ్చాక పాఠశాలల రూపురేఖలు ఎలా మారాయో తల్లితండ్రులు గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో 57వేల పాఠశాలలను రూ. 16వేల కోట్లతో అభివృద్ధి చేశారని తెలిపారు. అమ్మఒడి ద్వారా 84లక్షల మందికి రూ. 25వేల కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా పోషకాహారంతో జగనన్న గోరుముద్ద, నాణ్యమైన యూనిఫారం, బూట్లు, పుస్తకాల కోసం జగనన్న విద్యా కానుక ప్రతీ ఏడాది విద్యార్థులకు అందజేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే గగ్గోలు పెట్టారని, ప్రపంచ స్థాయిలో విద్యార్థులు పోటీ పడాలంటే ఇంగ్లీష్ తప్పనిసరని గుర్తించే.. జగనన్న ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఇంగ్లీష్ నేర్చుకుంటే తెలుగుకు అన్యాయం జరుగుతుందని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఖండించారు. విద్యార్థులు వారు చదువుకునే పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలని, ఆడుదాం ఆంధ్రలో సత్తాచాటాలని సూచించారు.



వంట సామాన్లను విద్యార్థితో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

దాతల సేవలు మరువలేనివి..

పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు, దాతలు, గ్రామస్తులు ముందుకు వచ్చి సహకారం అందిస్తేనే పాఠశాలలతో పాటు విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. అనంతరం దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏపీసీ రాములునాయక్, డీవైఈవో పద్మారాణి, ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ కొడాలి సుష్మా, దాతలు కిలారు శివకుమార్, కిలారు బ్రహ్మాజీ, కిలారు బసవపున్నయ్య, హెచ్ఎం వై.దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన వారు ఓటుకు దరఖాస్తు చేసుకోండి



పెనమలూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివయ్య

పెనమలూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించగా ఆయన పలు పోలింగ్ కేంద్రాలు సందర్శించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు అర్హులేనని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ప్రతీ గ్రామంలో ఓటు లేనివారిని గుర్తించి వారిచే ఓటుకు దరఖాస్తు చేయించాలని సూచించారు.

ఉయ్యూరు పట్టణంలో....

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్ఓలతో సమీక్షించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టామని యువత కొత్త ఓటు నమోదు చేసుకోవాని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే పోలింగ్ కేంద్రాలకు వచ్చి అర్జీలు అందజేయాలని సూచించారు.

విజయవాడరూరల్ మండలంలో....

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గన్నవరం నియోజకవర్గంలో 82 పోలింగ్ కేంద్రాల్లో, మైలవరం నియోజకవర్గంలో 52 పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు అర్హులైన వారి నుంచి ఓటు నమోదు దరఖాస్తులను స్వీకరించారు. మండల తహసీల్దారు కె.లక్ష్మీ, అధికారులు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాలను పరిశీలించారు.

నేడు మానవత భవనం ప్రారంభోత్సవం



మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులో నిర్మించిన మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు శనివారం తెలిపారు. మానవత కార్యాలయం నిర్మాణానికి జాతీయ రహదారి వెంబడి రూ. 40 లక్షల విలువ గల 120 చదరపు గజాల స్థలాన్ని జన్యావుల సీతారామయ్య, రంగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అప్పగించారని చెప్పారు. దాతల విరాళాలతో రూ.22.75 లక్షల వ్యయంతో గ్రౌండ్, మొదటి అంతస్తులతో నూతన భవనాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. భవన నిర్మాణానికి సిరి అగ్రో ఇండస్ట్రీస్ అధినేత నెరుసు శ్రీనివాసరావు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారని వెల్లడించారు. నూతన భవన ప్రారంభోత్సవానికి మానవత వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మానవత సభ్యులందరూ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి రాజారామ్

పాయకాపురం(విజయవాడరూరల్): దివ్యాంగులు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్గి ఉండాలని 4వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ సూచించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని స్పందన సేవా సమితి, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జడ్జి రాజారామ్ మాట్లాడుతూ దివ్యాంగులకు చట్టంలో అనేక రాయితీలు కల్పించిందని, ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. స్పందనసేవా సమితి అందిస్తున్న సేవా కార్యక్రమాలను జడ్జి అభినందించారు. అనంతరం 30మంది దివ్యాంగులకు సమితి నిత్యావసరవస్తువులను అందజేశారు. సేవాసమితి అధ్యక్షుడు ఇమ్మనేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ వి.బాబురావు, విజయవాడ శాఖ ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు, ఎన్టీపీసీ రిటైర్డు జనరల్ మేనేజర్ ఎంవీ బాబు, న్యాయసేవల అధికారి పి.రాము, దివ్యాంగుల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాత, సమితి సభ్యులు ఎ.యశోద, శ్రీనివాసరావు, అమరావతి రేర్ డీసీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో మినీ ట్రక్ బీభత్సం

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై శనివారం రాత్రి మినీ ట్రక్ బీభత్సం సృష్టించింది. పెనమలూరు నుంచి విజయవాడ వైపుకు పెనమలూరు పల్లిపేటకు చెందిన లంకే నాగరవితేజ మినీ ట్రక్‌తో బయలుదేరాడు. అతను పోరంకి బాలాజీ హోటల్ వద్దకు వచ్చిన తర్వాత ట్రక్కు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కారు, ఆటో, పలు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఆ ప్రాంతంలో ఉన్న జనాలు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ట్రక్ డ్రైవర్ నాగరవితేజను పోలీసులు అదుపులోకి తీసుకోగా అతను మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

పెనమలూరు: ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట శనివారం రాత్రి పెనమలూరు పోలీసులను రక్షణ కల్పించమని ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామంలో ఉన్న దళితవాడలో గంటా రమేష్ కుటుంబం ఉంటుంది. అతని కుమార్తె హైదరాబాద్‌లో జాబ్ చేస్తుంది. అయితే తాడిగడపలో అదే ప్రాంతానికి చెందిన కొమ్ము రవికుమార్, అమ్మాయి గత 2 సంవత్సరాలుగా ప్రేమలో ఉన్నారు. గత నెల 27న హైదరాబాద్‌లో వీరు చర్చిలో వివాహం చేసుకున్నారు. శనివారం రాత్రి పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రక్షణ కల్పించమని కోరారు. సమాచారం తెలుసుకున్న అమ్మాయి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇరు వర్గాల వారితో సీఐ రామారావు చర్చలు జరుపుతున్నారు.

మచిలీపట్నం వెళ్లి పింఛన్ పంపిణీ



పెనమలూరు: పెనమలూరు-1 సచివాలయం పరిధిలో ఉంటున్న పసుపులేటి అంజనీదేవి అనారోగ్యం కారణంగా గత కొద్ది రోజులుగా మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నెల పింఛన్ సొమ్మును గ్రామ వలంటీర్ వై.జ్యోతి శనివారం మచిలీపట్నంకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. విధుల నిర్వహణే లక్ష్యంగా వలంటీర్ జ్యోతి అందిస్తున్న సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

రైతులకు అండగా నిలుస్తాం



తెన్నేరులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: రైతాంగానికి అన్ని వేళలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తెన్నేరు, మంతెన గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పంట మార్కెట్‌కు చేర్చేందుకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం రవాణాకు వాహనాలు సిద్ధంగా ఉంచాలని కోత కోసిన ధాన్యం హుటాహుటిన మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పంట సంరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులను కోరారు. కొనుగోలు చేసిన ధాన్యంకు మూడు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌పీ ప్రసాద్, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, సర్పంచి వీరంకి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు నెరుసు సతీష్, చింతల అప్పారావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

విమానాశ్రయ నిర్వాసితులకు ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: విమానాశ్రయ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విమానాశ్రయ విస్తరణలో నివాస గృహాలు, స్థలాలు కోల్పోయిన 428 కుటుంబాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో విమానాశ్రయ నిర్వాసితుల ఏడేళ్ల నిరీక్షణ ఫలించిందన్నారు. 2016లో విమానాశ్రయ భూసేకరణ మొదలైనప్పటికీ నిర్వాసితులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. నిర్వాసితులకు గృహ నిర్మాణాల నిమిత్తం చేపట్టిన ఆర్ అండ్ఆర్ ప్యాకేజీలో నిర్దిష్టమైన ప్లాన్ రూపొందించలేదని దీంతో వారికి ప్లాట్లు కేటాయింపు, రిజిస్ట్రేషన్లకు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని వెల్లడించారు. ఈ విషయాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలో కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు నిర్వాసితులు చెల్లించాల్సిన సుమారు రూ. 3.76 కోట్లు స్టాంప్ డ్యూటీని మినహాయించినట్లు చెప్పారు. నిర్వాసితులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకుగాను ఒక్కొక్కరికి రూ. 9లక్షలు చొప్పున రెండు విడతలుగా మంజూరు చేసేందుకు కూడా అంగీకరించినట్లు తెలిపారు. గృహ నిర్మాణాలు ప్రారంభించేందుకుగాను ఈ నెల 10 నుంచి 20 లోపు నిర్వాసితుల బ్యాంక్ ఖాతాలో మొదటి విడత జమచేయనున్నట్లు చెప్పారు. విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతుల్లో మిగిలిన 20 శాతం మందికి కూడా ఈ నెలాఖరులోపు అమరావతిలో ప్లాట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కాసరనేని గోపాలరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, తహసీల్దారు సిహెచ్.నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచిలు డొక్కు వెంకన్నబాబు, నిడమర్తి సౌజన్య, బడుగు బాలమ్మ, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డీపీఎస్‌లో ఉత్సాహంగా వార్షిక క్రీడా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ఎక్స్ చైర్మన్ అంకమ్మచౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. స్పోర్ట్స్ కోటాలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం పలు ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్‌భాటియా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుపాను నుంచి పంటలు కాపాడుకోవాలి



పెనమలూరులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య, ఏవో శైలజ

పెనమలూరు: తుపాను నుంచి పంటలు కాపాడుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలల్లో శనివారం ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. తుపాను వస్తుందని వాతావరణ నిపుణులు ప్రకటించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేసి ధాన్యం తరలించడానికి సిద్ధం చేశారని అటువంటి రైతులు వర్షానికి ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ, రైతులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి...

ఉంగుటూరు: రానున్న రెండు రోజులు తుఫాన్ ఉంటుందని రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం వరి కోతదశలో ఉన్నదని వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు ప్రకారం రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని మిల్లుకు పంపడానికి గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

జాతీయ షూటింగ్‌కు వీఆర్ విద్యార్థిని



మేఘనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: జాతీయ షూటింగ్ సెలక్షన్‌లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని పాల్గొంటుందని కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగంలో 3వ సంవత్సరం చదువుతున్న మేఘన ఢిల్లీలో జరగనున్న జాతీయ షూటింగ్ సెలక్షన్‌కు ఏపీ నుంచి పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మేఘనను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శనివారం సాయంత్రం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమికి చెందిన దత్త, గేయ అక్షిత, చంద్రిక, ప్రియాంక, గీష్మశ్రీ, హేమశ్రీ, సుభిక్ష, యశస్విని, వెన్నెల మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఏర్పాటు చేసిన నాట్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

తుపాను గుబులు



ఈడుపుగల్లులో వరి కోతలు



పునాదిపాడు అండర్‌పాస్ వద్ద ధాన్యం బస్తాలపై కప్పిఉంచిన పరదాలు



ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

తుపాను గండం రైతుల్లో గుబులు రేపుతోంది. ఖరీఫ్ వరి పంట చేతికొచ్చింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరికోత యంత్రాలతో కోయించి ధాన్యం ఆర్బీకేల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా పంట పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడం, తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఆకాశం మబ్బులు కమ్మి, మోస్తరు జల్లులు కురవడం మొదలైంది. మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోనని కలవరపడుతున్నారు. హుటాహుటిన మిల్లులకు పంటను తరలించే పనుల్లో నిమగ్నమవుతున్నారు. తుపాను గండం తప్పిపోతే చాలని రైతులు ప్రకృతిని వేడుకుంటున్నారు.

– కంకిపాడు